విద్యార్థులను ఇష్టమైన రంగంలోనే ప్రోత్సహించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను వారికి ఇష్టమైన రంగంలోనే ప్రోత్సహించాలని విజయవాడ డీఐజీ విశాల్ గున్నీ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని కెనడీస్ నెక్స్ జెన్ కిడ్స్ పాఠశాల 10వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాల్ గున్నీ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానార్జనకు అధిక సమయాన్ని కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త రవాణా కమిషనర్ బి. కృష్ణవేణి, పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపల్ పీఎల్ హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 29వ డివిజన్‌లో పండగలా 'మనతో మన రజినమ్మ'



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విడదల రజిని, పక్కన ఎమ్మెల్యే మద్దాళి గిరి

పట్నంబజారు: విశ్వసనీయతకు మారుపేరు వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. గుంటూరు పట్టణం 29వ డివిజన్ నల్లకుంట ఆర్చీ సెంటర్ నుంచి గురువారం మనతో మన రజినమ్మ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. డివిజన్‌లోని ప్రజలతో మమేకమై.. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. గుంటూరు నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని, జగనన్న పాలనలో శరవేగంగా నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఆమె స్పష్టం చేశారు. పార్టీ నాయకులంతా ఐకమత్యంతో పనిచేసి, పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తొలి రోజు నుంచి ప్రజా ప్రతినిధులంతా ప్రజల్లోనే తిరుగుతున్నారన్నారు. శివారు కాలనీల వరకు అభివృద్ధిని తీసుకుని వెళ్లిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. డివిజన్ కార్పొరేటర్ రోషన్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి పండగ సంక్రాంతి



బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి రజిని

గుంటూరు ఎడ్యుకేషన్/లక్ష్మీపురం: పెద్ద పండగ సంక్రాంతి ముందస్తు సంబరాలను వివిధ కళాశాలల్లో గురువారం నిర్వహించారు. హిందూ కళాశాలలో జరిగిన సంబరాల్లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా పాల్గొని సంక్రాంతి విశిష్టతను వివరించారు. జీజీహెచ్ మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్ పాల్గొన్నారు.

- హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏఎన్‌యూ సీనియర్ ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్, పయనీర్ ఆటోమోటివ్స్ డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఇన్‌ట్యాక్ కో–కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు ఉన్నారు.
- పట్టాభిపురంలోని జీకేఆర్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ జి.జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుశీలరెడ్డి భోగి పండ్లు పోసి విద్యార్థులను ఆశీర్వదించారు.
- సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో కమిటీ అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు సక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణప్రభు, కోశాధికారి జయప్రకాష్, బాపూజీ కమిటీ అధ్యక్షుడు సాధు శివశంకర్, ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- లక్ష్మీపురం: అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.













మార్కెట్లో సంక్రాంతి ఆఫర్లు



నిమ్మల గార్డెన్స్‌లోని వేదిక



వస్త్ర కొనుగోలు దుకాణంలో..

- వస్త్రాలు, ఫర్నీచర్, ఆభరణాలు, వాహన కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్లు
- ఉచిత బహుమతులతో ఆకర్షిస్తున్న మొబైల్ షాపులు
- కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్న దుకాణాలు

పాత గుంటూరు: గుంటూరులో సంక్రాంతి శోభ సంతరించుకుంది. కుటుంబ సమేతంగా సంక్రాంతి షాపింగ్ చేస్తుండడంతో దుకాణాల్లో సందడి నెలకొంది. వస్త్ర దుకాణాలు కిటికిటలాడుతున్నాయి. సంక్రాంతి పురస్కరించుకొని షోరూం యాజమాన్యాలు కురిపిస్తున్న ఆఫర్లతో గుంటూరులోని బైక్ షోరూముల్లో ఎక్స్ఛేంజ్ మేళాలు, ఆఫర్లు, ప్రత్యేక డిస్కౌంట్లు, విలువైన ప్రత్యేక బహుమతులు, బంపర్ లక్కీడ్రాలు అందిస్తున్నాయి. వస్త్ర కొనుగోళ్లపై 20 నుంచి 50 శాతం వరకు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారు. ద్విచక్రవాహన షోరూంలలో పాత వాటిని తీసుకొని కొత్త వాహనాలను అందించడమే కాకుండా ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఫర్నీచర్ షాపుల్లో టేబుల్స్, బెడ్స్, సోఫా సెట్లు, గ్రైండర్లు, మైక్రోవేవ్ ఓవెన్తో పాటు ఇతర సామగ్రి కొనుగోళ్లలో 25 శాతానికి పైగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. గుంటూరులోని బ్రాడీపేట, లక్ష్మీపురం, పట్నం బజారు, గోల్డ్ షోరూంలలో ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తుండడంతో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. బంగారం ధర అధికంగా ఉన్నప్పటికీ షోరూం యాజమాన్యాలు అందిస్తున్న డిస్కౌంట్లతో కొనుగోళ్లు పెరిగాయని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

పెరిగిన మొబైల్ కొనుగోళ్లు

నగరంలోని బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో మొబైల్ షాపుల్లో స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. హెడ్సెట్, బ్లూ టూత్, హోం థియేటర్, పవర్ బ్యాంక్ ఇలా ప్రతీ కొనుగోలుపై ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. పండగ రోజు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి విలువైన వస్తువులను బహుమతిగా అందించనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

వేడుకలకు సిద్ధమైన ఫంక్షన్ హాల్స్

గుంటూరులోని స్వగృహ ఫంక్షన్ హాల్, పెద పలకలూరు రోడ్డులోని నిమ్మల గార్డెన్స్ శుభకార్యాలకు ముస్తాబయ్యాయి. ఆధునిక హంగులతో ప్రజలకు అన్ని వసతులతో సౌకర్యవంతంగా ఉండే విధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.





వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయడం జరిగిందని నగర కమిషనర్ చేకూరి కీర్తి తెలిపారు. ఈ నెల 9న సంపత్ నగర్‌లో బాలికపై వీధి కుక్కల దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కమిషనర్ స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు కుక్కల దాడిలో గాయపడిన బాలికను ఎంహెచ్‌ఓ మధుసూదన్ పరామర్శించి, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఏటుకూరు రోడ్డులో కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) చేయడానికి ఏజెన్సీని గుర్తించడం జరిగిందని, అగ్రిమెంట్ పూర్తి చేసి, అతి త్వరలో ఏబీసీ ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. జంతు ప్రేమికులు కూడా వీధి కుక్కల విషయంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను గమనించి, వీధి కుక్కలకు ఏబీసీ చేయించడంలో నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు.







యలమంచిలి శివాజీకి మిజోరం గవర్నర్ పరామర్శ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరుకు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు గురువారం హైదరాబాద్‌లోని శివాజీ నివాసంలో పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన శివాజీ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంటున్నారు. కాగా చిరకాల మిత్రులైన హరిబాబు, శివాజీ 1972లో జై ఆంధ్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా 1975 ఎమర్జెన్సీ కాలంలో లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్‌తో కలిసి విజయవాడలో సభలు నిర్వహించినందుకు గాను జైలుకు వెళ్లారు.

నిస్వార్థపరుడు లాల్ బహదూర్ శాస్త్రి

లక్ష్మీపురం: నిస్వార్థపరుడిగా పేరు పొందిన లాల్ బహదూర్ శాస్త్రి భారత జాతి చరిత్రలో ఒక ఆణిముత్యమని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్ గువల్లి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో లాల్‌బహదూర్ శాస్త్రీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత నిరాడంబర జీవితం గడిపిన భారత మాజీ ప్రధాన మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రీ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారన్నారు. విశ్లేషకులు ఎ.అమరాచారి, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

'గిరిజన విద్యార్థి సేన' క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: గిరిజన సేన గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటం సాగిస్తున్నట్లు అంజి హాస్పిటల్ ఎండీ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గిరిజన విద్యార్థి సేన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కొత్తపేటలోని అంజలి హాస్పిటల్‌లో ఆవిష్కరించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న విద్యార్థి సేన కృషి అభినందనీయమన్నారు. సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్, గిరిజన ఐక్యవేదిక నాయకుడు బి.శ్రీనునాయక్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.





